క్లుప్తంగా

పాల సేకరణ ధర తగ్గింపుపై నిరసన


ఆందోళన చేస్తున్న పాడి రైతులు

చోడవరం రూరల్ : పాల సేకరణ ధరను తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ పాడి రైతులు కదం తొక్కారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని డెయిరీ యాజమాన్యం ఇటీవల పాల సేకరణ ధరను తగ్గించడంతో శనివారం మండలంలోని నర్స య్యపేట పాల కేంద్రం ఎదుట పాడి రైతులు ఆందోళన చేశారు. పాల సేకరణ ధరను యధాతథంగా ఉంచాలని డిమాండ్ చేశారు. పాడి రైతులు ప్రస్తుత ధరలకే సతమతమవుతున్నారని, పశుపోషణ, సంరక్షణ తీవ్ర వ్యయ ప్రయాసలకు గురి చేస్తున్న సంగతి తెలిసి కూడా యాజమాన్యం ఈ రీతిలో వ్యవహరించడం తగదని అన్నారు. లాభాలను పంచడం మాట అటుంచి, వర్షాకాలం సాకుగా చూపి పాల సేకరణ ధరను తగ్గించడం తగదని వారు తమ ఆందోళను వెలిబుచ్చారు. నర్సయ్యపేట పాల ఉత్పత్తిదారుల సంఘం సభ్య రైతులు పెద్ద సంఖ్యలో నిరసనలో పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా నో బ్యాగ్ డే


కాగితాలతో తయారు చేసిన బొమ్మలతో విద్యార్థులు

మాకవరపాలెం: మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాశాఖ ఆదేశాలతో శనివారం 1, 2 తరగతుల విద్యార్థులు బ్యాగులు లేకుండా పాఠశాలకు హాజరయ్యారు. అనంతరం వీరితో కాగితాలతో వివిధ రకాల బొమ్మలు తయారు చేయడం, జంతువుల మాస్కులతో ఆటలాడించడం వంటివి చేయించారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యంగా నో బ్యాగ్ డేను నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం రాము తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోషి, లోవరాజు, నారనాయణరావు పాల్గొన్నారు.

బాలింతలకు బేబీ కిట్‌ల వితరణ


బాలింతలకు బేబీ కిట్‌లను అందిస్తున్న రామలక్ష్మి

కె.కోటపాడు : సత్యసాయి బాబ చూపిన సేవా మార్గం ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని సత్య సాయి సేవా సమితి బాల వికాస్ గురువు బండారు రామలక్ష్మి అన్నారు. సత్యసాయి నిర్ణయించిన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కె.కోటపాడు గ్రామానికి చెందిన తొమ్మిది మంది బాలింతలకు బేబీ కిట్‌లను సొంత నిధులతో కొనుగోలు చేసి వారి ఇళ్లకు వెళ్లి అందించారు. కార్యక్రమంలో మహిళా సేవాదళ్ బి.మణి పాల్గొన్నారు.

రోడ్లపై మద్యం దుకాణాలు వద్దు

కె.కోటపాడు : మద్యం షాపులను రోడ్లపై పెట్టకుండా గ్రామానికి దూరంగా పెట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకన్న డిమాండ్ చేశారు. కె.కోటపాడు సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త దుకాణాల్లో పాత మద్యం అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారులు మద్యం వ్యాపారుల కొమ్ము కాయరాదని హితవు పలికారు.

దేవీ ఆలయం గోపురానికి రూ.2 లక్షలు విరాళం


విరాళం అందజేసిన బాబా కృపానిధి దంపతులు

మాడుగుల: స్థానిక దేవీ ఆలయం గోపురం నిర్మాణానికి గ్రామానికి చెందిన సాలూరి గోకుల్‌దాస్, సరోజిని దంపతులు జ్ఞాపకార్థం, వారి కుమారుడు సాలూరి బాబా కృపానిధి, భారతి దంపతులు విరాళం అందజేశారు. ఆలయ గర్భగుడి పైన ఉన్న గోపురం నిర్మాణం కోసం శనివారం రూ.2 లక్షలు అందజేశారు. దాతలు ముందుకు వచ్చి గోపుర నిర్మాణానికి విరాళాలు అందజేయాలని, ఆలయ కార్యదర్శి ఎ.వి.ప్రసాద్ కోరుతున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 7997958337, 7075709854, 7997958336
సాక్షి

మట్టిలో కాసుల వేట

- కూటమి నేతల గ్రావెల్ దందా
- రాత్రి వేళల్లో పొక్లెయిన్‌తో ఏలేరు కాల్వ గట్టుపై తవ్వకాలు
- నర్సీపట్నంతో పాటు చుట్టు పక్కల మండలాలకు అక్రమ రవాణా
- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు
- కాలువ గట్టు, సొరంగానికి పొంచి ఉన్న ప్రమాదం


రాత్రి వేళల్లో పొక్లెయిన్‌తో తవ్వకాలు చేసిన ఆనవాళ్లు

నాతవరం : కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచి ఏలేరు కాలువ గట్టు మట్టి గ్రావెల్ అక్రమంగా తవ్వకాలు జరిపి రవాణా చేస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీరు తరలించేందుకు ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి నాతవరం మండలం మీదుగా కాలువ ఏర్పాటు చేశారు. జిల్లేడుపూడి గ్రామం వద్ద ఏలేరు కాలువకు సుమారుగా 280 అడుగుల లోతులో 3 కిలోమీటర్లు పొడవునా సొరంగం మార్గం ఏర్పాటు చేశారు. సొరంగం తవ్వకాలు చేసే సమయంలో లోపల నుంచి వచ్చిన మట్టిని కాలువకు ఇరువైపులా సుమారుగా 60 నుంచి 80 అడుగుల ఎత్తులో గ్రావెల్ మట్టి దిమ్మలు వేశారు. సొరంగం తవ్వకాలు ద్వారా వచ్చిన మట్టి గ్రావెల్ మరింత నాణ్యత కావడంతో ఈ ప్రాంతంలో ఊహించని గిరాకీ ఉంది. ఈ గ్రావెల్ మట్టి నాతవరం మండలం జిల్లేడుపూడి, చెర్లోపాలెం, లక్ష్మీపురం, వెంకయ్యపాలెం, గోవిందపురం ప్రాంతాల్లో ఏలేరు కాలువకు ఇరువైపులా లక్షల టన్నుల్లో ఉంది. దీనిపై కూటమి నేతలు కన్ను పడడంతో యథేచ్ఛగా అక్రమంగా తవ్వకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

టిప్పర్లు, ట్రాక్టర్లతో యథేచ్ఛగా అక్రమ రవాణా

తవ్విన గ్రావెల్‌ను రాత్రి సమయంలో టిప్పర్లు, ట్రాక్టర్ల మీద దర్జాగా లోడు చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లోనే ఏలేరు కాలువ ఒడ్డున ఉన్న గ్రావెల్ మట్టికి ఊహించని డిమాండ్ ఉండడంతో అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. నాతవరం మండలంలో టిప్పరుకు రూ.15వేలు ట్రాక్టరుకు రూ.2 వేలకు గ్రావెల్ విక్రయిస్తున్నారు. నర్సీపట్నం మండలం ఇతర ప్రాంతాలకు అయితే దూరాన్ని బట్టి ఇంకా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఏలేరు కాలువ గట్టు గ్రావెల్ మట్టి తవ్వకాలు చేయరాదని నిబంధనలు ఉన్నప్పటికీ పలువురు నేతలు అధికారం అండతో అధికారులను మచ్చిక చేసుకుని


టిప్పర్లు, ట్రాక్టర్లు రాకపోకలు సాగించిన బాటలు

విచ్చల విడిగా తవ్వకాలు చేస్తున్నారు. 2020లో అక్రమంగా ఏలేరు కాలువ గట్టు గ్రావెల్ మట్టి తరలిస్తుండగా అప్పటి నర్సీపట్నం ఏఎస్పీ రిశాంత్‌రెడ్డి పట్టుకోని కేసు నమోదు చేసి హెచ్చరికలు చేశారు. దీంతో చాలాకాలం పాటు ఇక్కడ ఎలాంటి తవ్వకాలు జరగలేదు. ప్రభుత్వం మారగానే అక్రమ


ఏలేరు కాలువ గట్టు వద్ద గ్రావెల్ మట్టి తవ్వకాలు

తవ్వకాలు జోరందుకున్నాయి. ఈ అక్రమ తవ్వకాల విషయాన్ని కొందరు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా వారు కూటమి నేతలకు భయపడి అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇదే విధంగా ఏలేరు కాలువ గట్టుపై తవ్వకాలు చేసి గ్రావెల్ మట్టి తరలిస్తే ఏలేరు కాలువకు సొరంగానికి ప్రమాదం పొంచి ఉంటుందని ఈ ప్రాంతీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



ఏలేరు కాలువ గట్టు నుంచి మట్టి గ్రావెల్ అక్రమ తవ్వకాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తాం. అధికంగా మట్టి గ్రావెల్ ఉన్నట్టయితే ప్రభుత్వం టెండర్లు పిలిచి విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఆ దిశగా అధికారులు దృష్టి సారిస్తే అక్రమ వ్యాపారం నివారించవచ్చు.

-అడిగర్ల రాజు,
సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

కొత్తూరులో చిన్నారులకు టీకాలు


టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న సన్యాసిరావు

కె.కోటపాడు : వ్యాధి నిరోధక టీకాలతో చిన్నారులకు వ్యాధులను ఎదుర్కొనగలిగే శక్తి సమకూరనున్నట్టు లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ జె.సన్యాసిరావు అన్నారు. కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జరిగిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 0–5 ఏళ్లలోపు చిన్నారులైన 17 మందికి టీకాలు వేశారు. 8 మంది గర్భిణులకు ధనుర్వాతం సోకకుండా టీకాలు వేశారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించే రోజును చిన్నారుల తల్లిదండ్రులకు ముందుగానే ఆశా కార్యకర్తలు తెలపాలని సన్యాసిరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సంతోషి కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ శాంతి పాల్గొన్నారు.

నేడు సీసీ రోడ్డుకు శంకుస్థాపన

నాతవరం : మండలంలో పెదగొలుగొండపేట గ్రామంలో ఆదివారం అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు పర్యటిస్తారని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ అన్నారు. పెదగొలుగొండపేట నుంచి వెదురుపల్లి వెళ్లే రోడ్డుకు శంకుస్థాపన చేస్తారని, గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజా కార్యక్రమాలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో గల ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పట్టణ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం : ప్రజారోగ్యం దృష్ట్యా మున్సిపాలిటీలో శానిటేషన్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం సచివాలయాలకు చెత్త సేకరణకు అవసరమైన డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. వీటిని చైర్‌పర్సన్ సచివాలయ శానిటేషన్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్‌పై ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఫిర్యాదులు వస్తే సంబంధిత విభాగం అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వార్డుల్లో వీధులను పరిశుభ్రం చేయడంతో పాటు ఇళ్ల నుంచి చెత్త సేకరణ విధిగా చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి, కమిషనర్ జంపా సురేంద్ర, పలువురు కౌన్సిలర్లు హాజరయ్యారు.


శానిటేషన్ సిబ్బందికి డస్ట్‌బిన్‌లు అందజేస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నట్టల నివారణ మందు వేయించాలి

కె.కోటపాడు : గొర్రెలు, మేకల కడుపులో ఏలికపాముల బెడదను అరికట్టడానికి ముందస్తుగా నట్టల నివారణ మందును పెంపకందారులు వేయించాలని కొరువాడ పశువైద్యాధికారి సీహెచ్.వై.నాయుడు సూచించారు. కె.సంతపాలెం గ్రామంలో శనివారం 220 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏలికపాముల కారణంగా గొర్రెలు, మేకల్లో పొట్ట పొంగడం , గడబ వాపు సమస్య తలెత్తుతుందని, దీని వల్ల సరిగా మేత తీసుకోక అనారోగ్యం పాలవుతాయని అన్నారు. దీని నివారణకు 2 నెలల వయస్సు పైబడిన గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్నట్టు చెప్పారు. పశుసంవర్ధకశాఖ ద్వారా ఏడాదికి రెండు పర్యాయాలు ఉచితంగా మందును వేస్తున్నామన్నారు.


నట్టల నివారణ మందును గొర్రెలు, మేకలకు వేస్తున్న పశువైద్యాధికారి నాయుడు

రోడ్లపై చెత్త ఇలాగేనా...

- నేతలవానిపాలెంలో పారిశుధ్యం తీరుపై డీపీఓ ఆగ్రహం


వారపు సంత నిర్వహించే ప్రదేశాన్ని శుభ్రం చేయిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మి

బుచ్చెయ్యపేట : నేతవానిపాలెం గ్రామంలో పరిసరాల అపరిశుభ్రతపై జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) శిరీషారాణి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలెం గ్రామంలో పర్యటించారు. రహదారులతో పాటు అంగన్‌వాడీ కేంద్రం వద్ద చెత్తాచెదారం, తుప్పలు, డొంకలు పెరిగిపోయి ఉండడంతో ఆమె పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం చెందారు. సిబ్బందితో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం ఎత్తించి ఊరికి దూరంగా తరలించారు. తుప్పలు, డొంకలను పొక్లెయిన్‌తో తీయించి ట్రాక్టర్లపై తరలించారు. ప్రతి శనివారం అధికారులు స్వచ్ఛ సంకల్పం పాటించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీపీవో చీపురు పట్టి రోడ్లు ఊడ్చి అధికారులను స్వచ్ఛ భారత్‌లో పాల్గొనేలా చేశారు. రోడ్లపై చెత్తాచెదారం వేస్తే చర్యలు తీసుకోవాలని ఈవో లవ రాజును ఆదేశించారు.

ఆరు బయట చెత్త వేస్తే రోగాలు వ్యాప్తి

నాతవరం : రోగాలు వ్యాపించకుండా ఉండాలంటే ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి అన్నారు. ఆమె శనివారం మండల కేంద్రంలో వారపు సంత నిర్వహించే ప్రదేశంలో స్వచ్ఛతా సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన కూడలిలో దుకాణాల యాజమానులకు తడి చెత్త , పొడి చెత్తపై అవగాహన కల్పించారు.


నేతవానిపాలెంలో స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న డీపీవో శిరీషారాణి

మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున పంచాయతీలో తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ చేయాలని, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు.ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి పాల్గొన్నారు.

రోలుగుంట : మండల కేంద్రం రోలుగుంటలో ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శనివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ బయట, లోపల ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు. ఎంపీడీవో మాట్లాడుతూ రహదారుల పక్కన ప్రభుత్వ. ప్రయివేటు పాఠశాలలు, కార్యాలయాల వద్ద పరిసరాలు శుభ్రపరచాలన్నారు. గ్రామస్తుల తమ ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సర్పంచ్ కొప్పుల వరలక్ష్మి , కొండపాలెం, ఎం.కె.పట్నం గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, చిరంజీవి, ప్రత్యేకాధికారి రామ్మోహనరావు పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని అప్పలరాజుపురంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో తుప్పలు తొలగింపు, చెత్త తొలగింపు కార్యక్రమాలను శనివారం అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మతో పాటు సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, ఎంపీడీవో హేమసుందర్, ఈఓపీఆర్‌డీ కామేశ్వరరావు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

రోలుగుంట : గొర్రెల యజమానులు వాటి పెంపకంలో తరచూ మందలోని గొర్రెపోతులను మారుస్తూ వాటి పోషణ, వ్యాధుల నివారణలో తగు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధకశాఖ అధికారి రామ్మోహన్‌రావు సూచించారు. మండలం ఎస్.కొత్తూరు పంచాయతీ శివారు గొల్లపేట గ్రామంలో శనివారం సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సామూహిక గొర్రెల, మేకల ఉచిత నట్టల నివారణ (మాస్ డీ వార్మింగ్) కార్యక్రమాన్ని రోలుగుంట పశు వైద్యాధికారి నూకేశ్వరావు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖాధికారి ప్రారంభించారు. నిర్దేశిత సమయాల్లో నట్టల నివారణ మందులు వేయాలన్నారు.

రెవెన్యూ గ్రామసభల్లో అర్జీల స్వీకరణ


మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్


పోలవరంలో రెవెన్యూ సదస్సు


ఉగ్గినవలసలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ భాగ్యవతి

నాతవరం : భూ రీసర్వేలో జరిగిన లోపాలను సరిచేసేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండలంలో చమ్మచింత పంచాయతీ శివారు పొట్టి నాగన్నదొరపాలెం గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. భూ రీసర్వే చేసేటప్పుడు ఎవరైనా రైతుల భూములు రికార్డుల్లో తప్పులుగా నమోదైతే ఈ సభలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామసభలో రైతుల నుంచి 11 దరఖా స్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలకాడ కొండబాబు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయరు డి.ప్రసాద్ పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో పోలవరంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలు సమస్యలపై రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

కె.కోటపాడు : రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారాన్ని గ్రామసభల ద్వారా చూపనున్నట్లు తహసీల్దార్ భాగ్యవతి అన్నారు. ఉగ్గినవలస గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. భూ విస్తీర్ణం, సర్వే నంబర్‌లు, ఆధార్ నమోదులో తప్పులు ఉన్న రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిశీలించి 15 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సూరి, వీఆర్వో గంగునాయుడు, పాల్గొన్నారు

మాడుగుల రూరల్ : గతంలో జరిగిన భూ సర్వేలో రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చినా సరే గ్రామ సభల దృష్టికి తీసుకురావాలని తహసీల్దారు కె. రమాదేవి అన్నారు. మండలంలో అవురువాడ సచివాలయంలో రెవెన్యూ గ్రామ సభ శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో 10 దరఖాస్తులు అందినట్టు తహసీల్దారు తెలిపారు.

దేవరాపల్లి : రెవెన్యూ గ్రామ సభలో తమ దృష్టికి వచ్చే సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని దేవరాపల్లి తహసీల్దార్ పి.లక్ష్మీదేవి అన్నారు. తామరబ్బ పంచాయతీ పరిధి పెద సోంపురంలో శనివారం జరిగిన గ్రామసభలో ప్రజలు, రైతుల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

మాడుగుల రూరల్: అల్లూరి జిల్లా, ముంచింగ్‌పుట్ మండలం, వనుగుమ్మ జి.యు.పి.ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న కుండ్రపు సత్యం మృతి పట్ల ఆయనతో చదువుకున్న పూర్వ విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. సత్యం గుండెపోటుతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. చీడికాడ మండలం, ఖండివరం గ్రామానికి చెందిన సత్యం 1998 డీఎస్సీలో ఎంటీయస్ ఉపాధ్యాయునిగా గత ఏడాది విధుల్లో చేరారు. 1986 పదో తరగతి పూర్వ విద్యార్థులు సత్యం మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్–14 విభాగంలో కె.బాల, అండర్–17 విభాగంలో యశ్వంత్, మహేష్ ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ప్రిన్సిపాల్ క్రీడాకారులకు సూచించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- సీపీఎం నేతల డిమాండ్



మాడుగులలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మాడుగుల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతన విద్యుత్ చట్టాన్ని తీసుకొచ్చి, అధిక విద్యుత్ చార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేస్తోందని మండల సీపీఎం కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి విమర్శించారు. శనివారం శంకరం పంచాయతీ శివారు బోడ్డరేవు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. గతంలో వాడుకున్న విద్యుత్‌కు నేడు బిల్లులు కట్టించుకునే విధానం నేటి ప్రభుత్వం మానుకోవాలన్నారు. విద్యుత్ ఛార్జీల్లో ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలు, సెస్సులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ చట్టాలను గతంలో ప్రతిపక్షంలో వున్న టీడీపీ, జనసేన పార్టీలు వ్యతిరేకించాయని గుర్తు చేశారు. కానీ నేడు అధికారంలోకి వచ్చాక అదే విధానం కొనసాగిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల నాయకురాలు కె.భవానీ, మల్లుదొర, బచ్చల ఈశ్వరావు, నాగార్జున, విజయశాంతి, అచ్చిబాబు, చిన్నారావు, బాలకృష్ణ, సన్యాసిరావు పాల్గొన్నారు.


దేవరాపల్లి : నూతన విద్యుత్ చట్టాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం అధిక విద్యుత్ చార్జీలను వసూలు చేయడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి బి.టి. దొర అన్నారు. రాష్ట్రంలో కరెంట్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ వాలాబు పంచాయతీ పరిధిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నిరసనలో జర్త ఈశ్వరరావు, బుచ్చిబాబు పాల్గొన్నారు.

సుడిదోమ, పాచితెగులు నివారించాలి

బుచ్చెయ్యపేట : ఖరీఫ్ వరి పంట ఆశాజనకంగా ఉన్న పలు గ్రామాల్లో సుడిదోమ, పాచితెగులు విజృంభిస్తుందని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె.రాజ్‌కుమార్ రైతులకు సూచించారు. శనివారం కొండెంపూడి, మేడివాడ తదితర గ్రామాల్లో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం కింజారపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అందిస్తున్న వ్యవసాయ సూచనలు, సలహాలను కేవీకే శాస్త్రవేత్తలు పరిశీలించారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

మాడుగుల : మండలంలో గాదిరాయి, వొమ్మలి, సత్యవరం, వీరనారాయణం గ్రామాల్లో శనివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. గాదిరాయిలో రూ.70 లక్షలు, వొమ్మలిలో రూ.77 లక్షలు, సత్యవరంలో రూ.54 లక్షలు, వీరనారాయణంలో రూ.80 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణానికి స్థానిక శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఎంపీటీసీలు అప్పారావు, సత్యవతి హరికృష్ణ, దాడి నూకరత్నం పాల్గొన్నారు.


సత్యవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రమణ, అర్జున్

మాకవరపాలెం : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామరావుకు శనివారం అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. దీనివల్ల పేద విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేసే పరిస్థితి ఉందన్నారు. మండలంలో వేల సంఖ్యలో విద్యార్థులు వివిధ కోర్సుల్లో చదువుతున్నారని, వీరంతా ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాల యాజమాన్యాలు సైతం విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామంటున్నాయని, ఈ పరిస్థితుల్లో పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న విద్య, వసతి దీవెనతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com